క్లుప్తంగా

ఘనంగా సప్త శనివారాల వ్రతం



శనివారాల వ్రత పూజలో భక్తులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ శర్మ సప్త శనివారాల వ్రతాల పూజలు నిర్వహించారు. అంతకమునుపు శ్రీవారికి పంచామృతాభిషేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్రగా అంజన్న దర్శనానికి

వీరపునాయునిపల్లె : శ్రావణ మాసం రెండవ శనివారం గండి అంజన్న దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు కాలినడకన వెళ్లారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కమలాపురం, వీరపునాయునిపల్లె మండలంలోని పలు గ్రామాల నుంచి వెళ్లి శనివారం స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు పాలగిరి క్రాస్ వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం బోజన సౌకర్యం కల్పించారు.

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పెంపు

తొండూరు : కంది, జొన్న, మినుము, పసుపు, ఉల్లి పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవడానికి ప్రభుత్వం గడువు పెంచిందని మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ఈ పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 14వ తేదీ వరకు సీఎస్‌ఈ సెంటర్లలో ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను శనివారం పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పరిశీలించారు. అచ్చివెల్లి, ఎర్రబల్లె, కనంపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సీఐలు చాంద్‌బాషా, వెంకటరమణలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కూడా ముగిసిందన్నారు. మూడు పార్టీలు పోటీ చేస్తున్నాయన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు కూడా ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యం

పులివెందుల రూరల్ : ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యమని ఎవరూ మత్తు జోలికి వెళ్లొద్దని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక సీఎస్‌ఐ చర్చి మైదానంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చాలన్నారు. అనంతరం మత్తువలన జరిగే అనర్థాలతో కూడిన పోస్టర్లను ఆయన ఆటోలకు అతికించారు. కార్యక్రమంలో ఎస్‌ఏహెచ్‌ఎస్ అధ్యక్షుడు రాజు, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ గ్లాసులను ఉపయోగిస్తే జరిమానాలు తప్పవు



టీ షాపు యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : పేపర్ గ్లాసులను ఉపయోగిస్తే జరిమానాలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శనివారం పట్టణంలోని టీ, కాఫీ షాపులతోపాటు కూరగాయల మార్కెట్‌లోని అంగళ్లను సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇతిహాస గ్రంథాలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలు

లింగాల : రామాయణం, మహాభారతం, మహా భాగవతం గ్రంథాలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతి రూపాలు అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎస్.తులసిరెడ్డి తెలిపారు. శనివారం లింగాలలో భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగవత పండితులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావం.. అన్నదాతకు శాపం



వర్షాభావంతో దిగుబడిలేని ప్రొద్దుతిరుగుడు



పొలంలో ఎండిపోయిన మినుము

ఎండుతున్న ప్రొద్దుతిరుగుడు, మినుము పంటలు

ముద్దనూరు : ఖరీఫ్ సీజన్ ఆరంభంలో సాగుచేసిన పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయి. ఎండుదశకు చేరుకోవడంతో పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రొద్దుతిరుగుడు, మినుముతో పాటు కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి తదితర పంటలు జూన్ ఆరంభంలో రైతుల సాగుచేశారు. పంటసాగు చేసే సమయంలో వర్షం కాస్త ఆశలురేపింది.

దీంతో ఎక్కువ శాతం మంది ప్రొద్దుతిరుగుడు పంటను సాగుచేశారు. పంట సాగుచేసి ఇప్పటికి సుమారు 60 రోజులు గడుస్తోంది. పంట పెరిగే సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు బెట్టస్థితికి చేరుకున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రొద్దుతిరుగుడు, మినుము తదితర పంటలు సాగుచేసిన రైతన్నలు 1 ఎకరాకు సుమారు రూ.5 నుంచి 10 వేల వరకు ఖర్చుచేశారు. పంటలు ఎండిపోతుండటంతో నష్టం వాటిల్లితోందని రైతులు అంటున్నారు.

ప్రొద్దుతిరుగుడు సాగుతో నష్టం



నేను 10 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు సాగుచేశాను. ఎకరా సాగుకు పురుగుమందులు ఖర్చులు కలిసి సుమారు రూ.10వేలు పెట్టుబడిపెట్టాను. పంట ఎండుదశకుచేరింది. ప్రొద్దుతిరుగుడు పంటసాగులో నష్టపోతున్నాను.

-రామసుబ్బారెడ్డి, రైతు, రాజులగురువాయిపల్లె

వర్షంలేక పంట బెట్టస్థితిలో వుంది



ప్రొద్దుతిరుగుడు పంటకు వర్షం లేకపోవడంతో పంట బెట్టస్థితికి చేరింది. ప్రొద్దుతిరుగుడు సాగుచేసిన రైతులందరూ వర్షం లేకపోవడంతో ఇబ్బందులపాలవుతున్నారు. పంట చివరిదశలో ప్రస్తుతం వర్షంకురిసినా ప్రయోజనం లేదు. ఇప్పటికే ఆర్థికంగానష్టపోయాము.

-వరదయ్య, రైతు, నల్లబల్లె

సకాలంలో వర్షం కురవకపోవడంతోనే నష్టం



మండలంలోని సుమారు 450 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు సాగులో వుంది. సరైన సమయంలో వర్షం కురవక పోవడంతో ప్రొద్దుతిరుగుడు పూర్తిగా బెట్టస్థితిలో వుంది. పంటస్థితిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి నివేదిక అందజేశాం. ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా పంటను పరిశీలించారు. రాజులగురువాయిపల్లె, తిమ్మాపురం, నల్లబల్లె ప్రాంతాల్లో ప్రొద్దుతిరుడు అధికంగా సాగుచేశారు.

-వెంకటకృష్ణారెడ్డి, ఏవో, ముద్దనూరు

అన్నదాతలకు ప్రభుత్వం వెన్నుపోటు

పులివెందుల టౌన్ : అన్నదాత సుఖీభవ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కోతలు పెడుతూ, కేవలం రూ.5 వేలు మాత్రమే విడుదలచేసి అన్నదాతలకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి విమర్శించారు. శనివారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.40 వేలకు గానూ, కేవలం రూ.5 వేలు మాత్రమే ప్రభుత్వం ఇవ్వనుందని, గత ఏడాది ఖరీఫ్, రబీ డబ్బులు మొత్తం ఎగనామం పెట్టిందన్నారు. 7 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రైతు భరోసా కోత పెట్టిందన్నారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ప్రస్తుతం కేంద్రం ఇచ్చే సాయంతో రూ.20 వేలు ఇస్తామని మెలిక పెడుతున్నారన్నారు. గత ఏడాది రైతులకు రూ.10,800 కోట్లు ప్రభుత్వం ఎగ్గొట్టిందని, ఈ ఏడాది కేవలం రూ.2,342 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. అన్నదాతలు వ్యవసాయంలో వాడే ఎరువుల రేట్లు కూడా అధికంగా పెరిగాయని, పండించే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం చాలా బాధాకర విషయమన్నారు. పొగాకు, మిర్చి, మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

నాటక రంగ పురోగతికి బళ్లారి రాఘవ ఎంతో కృషి



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ

పులివెందుల టౌన్ : బళ్లారి రాఘవాచార్యులు తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతికి వెచ్చించారని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ తెలిపారు. శనివారం తాడిపత్రి రాఘవాచార్యులు జయంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక ఫుడ్అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధ్యాపకులతో కలిసి బళ్లారి రాఘవ చిత్ర పటానికి పుష్ప నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాఘవాచార్యులు కళ సమాజంలో మార్పు కోసం ఉపయోగపడాలనుకునేవారని, తెలుగు నాటక రంగం ఉన్నంతవరకు ఆయన పేరు అజరామరంగా ఉంటుందన్నారు. తాడిపత్రి రాఘవాచార్యులు చేసిన సేవలకు ఆయన పేరు మీద ప్రభుత్వం స్టాంపును కూడా విడుదల చేసిందన్నారు. తాడిపత్రి రాఘవాచార్యులు జీవిత చరిత్ర గురించి కళాశాల విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి కీర్తి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకున్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : కూటమి ప్రభుత్వం ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం మోరగుడి గ్రామంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జమ్మలమడుగు రూరల్ అధ్యక్షుడు వంగల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తల్లి వందనం పేరుతో వేసిన డబ్బులు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందలేదన్నారు. చేనేతలకు ఇవ్వవలసిన సబ్సిడీ ఇంత వరకు మంజూరు కాలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఒకటి లేదా రెండు పథకాలు మాత్రమే చేసి అవి కూడా పూర్తి స్థాయిలో చేయకుండా చేతులు దులుపుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు చెప్పిన హామీలు అమలు పరచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసం చేసిన విధానం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, వంగల సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, యోబ్, స్థానిక బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేస్తాం

కమలాపురం : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేస్తామని, అదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా వాటిని పగులగొట్టి తీరుతాం అని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సంస్కరణలు తెచ్చింది తానేనని చంద్రబాబు చంకలు గుద్దుకుంటుంటాడని, ఆ సంస్కరణల భారం అంతా ప్రజల పైనే పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ చార్జీలు పెంచితే ప్రజల్లో తిరుగుబాటు మొదలై ప్రభుత్వం పడిపోయిందని ఆయన గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ అంటే మొబైల్ రీచార్జ్‌తో సమానం అని, రీచార్జ్ చేసుకోకుంటే సరఫరా ఆగిపోతుందని, దీంతో మొత్తం చీకటిమయం అవుతుందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సరఫరా సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నం మానుకోవాలని ఆయన హితవు పలికారు. విద్యుత్ పేరుతో ప్రజలను దోచుకుంటే పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

హార్ట్ పేషంట్లను మినహాయించాలి

వేంపల్లె : జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట మండలాల జెడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో హార్ట్ పేషంట్ల ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. శనివారం వేంపల్లి ఎంఈఓ వి.వెంకట్రామిరెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది వివరాలను పంపాలని జిల్లా ఉన్నతాధికారులు ఎంఈఓలకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రీజియన్ కన్వీనర్ వి.ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్‌లు

జమ్మలమడుగు : ఈనెల 5వ తేదీ పాలిటెక్నిక్ కాలేజి ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ కె. విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌లకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ రాయనివారు, క్వాలిఫై కానివారు ఎవరైనా అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనవచ్చు అని సూచించారు. అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్‌లకు వచ్చేటప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్లుల తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు రూ.6 వేలు నగదు తీసుకుని 5వ తేదీ ఉదయం 9:30 నిమిషాలకు ముద్దనూరు రోడ్డులో ఉన్న పాలిటెక్నికల్ కాలేజికి రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి ఉత్తీర్ణత అయిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధులు, వికలాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలు

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాలలోని దివ్యాంగులకు, 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులకు వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు అవసరమైన స్క్రీనింగ్ శిబిరం ఈనెల 4వ తేదీ సోమవారం ఏర్పాటు చేసినట్లు, అర్హులైన వారందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి తెలిపారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం అలింకో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపునకు వచ్చే వారు సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డులు, యూడీఐడీ వైకల్య గుర్తింపు కార్డు తదితర 2 సెట్ల జిరాక్స్ పత్రాలతో, 2 వైకల్య ఫొటోలతో, వయో వృద్ధులు 2 ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డులను తీసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని అర్హులైన వికలాంగులు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9247339815 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని నరాల, వెన్నముక, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

జమ్మలమడుగు : పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల మినహా ఎవరికి అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను హరించేవిధంగా ఉన్నాయని వాటిని వెనక్కి తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివనారాయణ తెలిపారు. ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు బయటికి రాకుండా తొక్కిపెట్టాలనే లక్ష్యంతోనే విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉందన్నారు.

• అంజనీ పుత్ర.. వీరాంజనేయ



ప్రత్యేక అలంకరణలో తూర్పు ఆంజనేయస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : శ్రావణమాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి శనివారం తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు, ఆకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయ స్వామి, కోతి సమాధి, పీడబ్ల్యూబీ కాలనీ, ఆర్ ఆర్ కాలనీలతోపాటు వివిధ అంజన్న ఆలయాల్లో భక్తుల తాకిడితో కనువిందు చేశాయి. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

• ఆంజనేయుడికి అభిషేకాలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి మూలవిరాట్

కమలాపురం : మండల పరిధిలోని సి.గోప్పులాపురం గ్రామంలో ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రావణ మాస రెండో శనివారంను పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, సింధూరంతో అర్చన, ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన కుమ్మెత్త శ్రీనివాసులురెడ్డి, సుమిత్ర దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని కమలాపురం, కోగటం, కుంట తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాలలో శ్రావణ శనివారం సందర్భంగా ఉత్సవాలను నిర్వహించారు. పాలతల క్రాస్ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద శ్రావణ మాసం 2వ శనివారం సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. వినోద కార్యక్రమాలు, ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన పన్నెండు జతల ఎద్దుల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చిన వృషభాచలేశ్వరుడు



వైకుంఠవాసుడిగా దర్శనమిస్తున్న శ్రీవృషభాచలేశ్వరస్వామి

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించామని ఈఓ హనుమంతరావు తెలిపారు. అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో అభిషేకం, త్రికాల ఆరాధన, నివేదన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 9వ తేదీన ఎద్దులకొండపై వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాలను పూర్తి చేయాలి



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ రాజ్యలక్ష్మి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదును పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వేంపల్లె గ్రామ పంచాయతీ వివరాలను నమోదు చేయడంలో వెనుక పడి ఉందని, వివరాలను నమోదు చేసేందుకు 10 మంది కమిటీతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. వారం లోపల స్వర్ణ పంచాయతీ పోర్టర్‌లో ప్రత్యేక బృందం వివరాలను పూర్తి చేయాలని ఆదేశించారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి యాజమానులు తమ వివరాలను నమోదు చేసుకుంటే ఇంటి పన్నులు, నీటి పన్నులకు సంబంధించి ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. ఇంటి వద్ద నుంచే యాజమానులు ఇంటి పన్నులు, నీటి పన్నులతోపాటు ఇతర పన్నులు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంటి యాజమానులకు సులభతరం కోసం స్వర్ణ పంచాయతీ ప్రభుత్వం ఈ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, వేంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుద్ధ్యం చాలా అధ్వానంగా ఉందని, కాబట్టి సిబ్బంది బాగా పని చేయాలని ఆదేశించారు. పంచాయతీకి త్వరలోనే కార్యదర్శిని నియమించి సిబ్బందికి జీతాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఈఓలు నాగభూషణం రెడ్డి, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దిగుబడులు సాధించే పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి

వేంపల్లె : అధిక దిగుబడులు సాధించే పంటలను రైతులు సాగు చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్సార్ సభా భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎం కిసాన్ నిధుల ప్రారంభం కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా పెట్టుబడి సహాయంగా అవకాశం కల్పించిందన్నారు. పాడి పంటలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా భవిష్యత్తులో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు ద్వారా వ్యవసాయం చేసే రైతులకు ప్రత్యేకంగా కౌలు కార్డులు జారీ చేస్తామని, వాటి ద్వారా కౌలు రైతులకు కూడా భవిష్యత్‌లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ హరినాథరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం



పులివెందుల : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి



లింగాల : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది



చింతకొమ్మదిన్నె : మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

వేంపల్లె : పుట్టిన బిడ్డకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ ఉన్నీషాబేగం తెలిపారు. శనివారం నందిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఈ ప్రపంచంలో ఏదీ లేదన్నారు. ప్రతి తల్లి పుట్టిన అర గంట నుంచి ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డలకు అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధులను దూరం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రమాదేవి, ఆరోగ్య కార్యకర్త నాగస్వర్ణ, ఆశా కార్యకర్త రాజేశ్వరి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లి పాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక జెండామాను వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లులకు పుట్టిన బిడ్డలకు పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సోమేశ్వరి, సావిత్రి, మహిళా పోలీసు నిరోషాభాను, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : పుట్టిన పిల్లలకు మొదటి టీకా తల్లి ముర్రుపాలు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం దిగువలింగాల అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారిస్తుందన్నారు. అనంతరం తల్లి ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ప్రవీణ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన తల్లిపాల ప్రాముఖ్యత, అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. తల్లిపాలు బిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరమన్నారు. చాలామంది అవగాహనా లోపంతో కాన్పు ల నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించడం, అక్కడ అధికభాగం శస్త్రచికిత్స ద్వారా ప్రసవాలను చేయడం వల్ల బిడ్డకు మొదటి గంటలోపే ముర్రుపాలు తాగించే అవకాశం లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : తల్లి పాలు బిడ్డకు తొలి పోషణ మరియు రక్షణ అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. నేలతిమ్మాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాగ్యమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.